క్లుప్తంగా

బడ్జెట్‌పై సీపీఎం నేతల ధర్నా



నెల్లూరు(వీఆర్సీసెంటర్): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్యులకు వ్యతిరేకంగా.. సంపన్న వర్గాలకు అనుకూలంగా ఉందని సీపీఎం నేతలు ఆరోపించారు. కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ నగరంలోని గాంధీబొమ్మ సెంటర్ వద్ద ధర్నాను సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు మోహన్‌రావు, నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, నగర కార్యవర్గ సభ్యుడు నాగేశ్వరరావు మాట్లాడారు. బడ్జెట్లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. ప్రత్యేక హోదాను గాలికొదిలేయడంతో పాటు ప్రత్యేక ప్యాకేజీని సైతం ఇవ్వలేదని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వానికి భజన చేయడాన్ని టీడీపీ ప్రభుత్వం మాని విభజన చట్టంలోని హామీలను సాధించాలని హితవు పలికారు.

గుర్రం జాషువాకు నివాళి



నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో గుర్రం జాషువా వర్ధంతిని సింహపురి పద్యనాటక కళాకారుల సంక్షేమ సంఘ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భక్త చింతామణి, సత్యహరిశ్చంద్ర నాటికలను రంగస్థల నటులు ప్రదర్శించారు. ఏపీ జెన్‌కో డీఎస్పీ శ్రీనివాసరావు, సంఘ జిల్లా అధ్యక్షుడు భద్రాచలం బాబు, ప్రధాన కార్యదర్శి చక్రపాణి, ఉపాధ్యక్షుడు చెంచురామయ్య, గౌరవాధ్యక్షుడు ఖాజామస్తాన్, కోశాధికారి కొమ్మారెడ్డి హరనాథ్‌రెడ్డి, సహాయ కార్యదర్శి దండి సురేష్, రామకృష్ణ, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్లంలో పట్టు సాధించడమే లక్ష్యం



ప్రశంసాపత్రం అందుకుంటున్న ఉపాధ్యాయిని

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : విద్యార్థులు ఆంగ్లంలో పట్టు సాధించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని బుచ్చిరెడ్డిపాళెం ఎంఈఓ దిలీప్‌కుమార్ అన్నారు. పట్టణంలోని డీఎల్ఎన్నార్ ఉన్నత పాఠశాలలో విభా లీప్ ఫర్ వర్డ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అల్లూరు, బుచ్చిరెడ్డిపాళెం, విడవలూరు మండలాల ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు ఆంగ్లభాషపై ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఎంఈఓ దిలీప్‌కుమార్ మాట్లాడుతూ సమగ్రశిక్ష ఆదేశాల మేరకు ఉపాధ్యాయులకు ఆంగ్లభాషా నైపుణ్యాలు, బోధనపై శిక్షణ ఇస్తున్నట్లు తెలియజేశారు. విద్యార్థులు ఆంగ్లభాషలో పట్టు సాధించేలా ఉపాధ్యాయులు బోధన చేయాలని సూచించారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు ఆంగ్లంపై పట్టు సాధించేలా శిక్షణ ఇవ్వడం ద్వారా బంగారు భవితకు బాటలు పడుతుందన్నారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 రత్నం, విభా ఫౌండేషన్ మాస్టర్ ట్రైనర్ చైతన్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి



పొదలకూరు : రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకుని పంటల సాగు చేయాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి యు.గీతాకుమారి సూచించారు. పొదలకూరు మండలం డేగపూడి గ్రామంలో ఆత్మ సౌజన్యంతో రైతులకు సమగ్ర ఎరువుల యాజమాన్యంపై శిక్షణను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా రైతులు ఎరువులను వాడుకుంటే దిగుబడులు పెరుగుతాయన్నారు. సేంద్రియ ఎరువులు వాడనందున నేల జీవం కోల్పోయి క్రమంగా పంట ఉత్పాదకత క్షీణిస్తుందని తెలిపారు. తర్వాత రసాయన ఎరువుల మోతాదు పెంచాల్సి వస్తుందన్నారు. దీనివల్ల సూక్ష్మపోషకాల లోపాలు అధికమై పంటల దిగుబడి తగ్గుతుందన్నారు. నెల్లూరు, తిరుపతిలో లభించే జీవన ఎరువులను వాడుకుని రసాయన ఎరువుల మోతాదు 25 శాతం వరకు తగ్గించుకోవాల్సిందిగా సూచించారు. రసాయన ఎరువుల వాడకం వల్ల కలిగే అనర్థాల గురించి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త కె.కిరణ్‌కుమార్‌రెడ్డి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఓబుల్‌రెడ్డి, ఇఫ్కో జిల్లా సేల్స్ మేనేజర్ వి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గాడి తప్పిన పాలన

- ఎవరికి వారే యమునా తీరే
- ఏళ్ల తరబడి పాతుకుపోయిన అధికారులు, సిబ్బంది
- సమయపాలన పాటించని వైనం
- నగరపాలక సంస్థ కార్యాలయంలో ఇదీ తీరు



కార్పొరేషన్ కార్యాలయం

నెల్లూరు(బారకాసు): రాష్ట్రంలోని పెద్ద కార్పొరేషన్లలో నెల్లూరు నగరపాలక సంస్థ ఒకటి. దాదాపు ఎనిమిది లక్షల మంది నివసిస్తున్న నగరాన్ని అభివృద్ధి చేయడంలో.. సమస్యలను పరిష్కరించడంలో దీని పాత్ర ఎంతో కీలకం. అయితే ఇక్కడ పాలన గాడితప్పింది. అడిగే వారు లేక ఉద్యోగులు ఎవరికి వారే యమునా తీరే అనే చందంగా వ్యవహరిస్తున్నారు. కొందరు అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించకపోగా.. మరికొందరు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. కార్యాలయంలోని పలు విభాగాల్లో కొంత మంది ఉద్యోగులు ఏళ్ల తరబడి పాతుకుపోయారు. మరోవైపు ఇక్కడ అవినీతి, అక్రమాలు మితిమీరిపోయాయి. ఇలా నగరపాలక సంస్థ కార్యాలయంలో పాలనపరంగా అనేక సమస్యలు నెలకొన్నాయి. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ పరిపాలనను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది.

నగరం.. సువిశాలం

నగరపాలక సంస్థ పరిధిలో 54 డివిజన్లు.. 167 సచివాలయాలున్నాయి. 150 కిలోమీటర్ల విస్తీర్ణం గల నగరంలో 1,83,643 గృహాలున్నాయి. ఇందులో దాదాపు ఎనిమిది లక్షలకుపైగా జనాభా నివసిస్తున్నారు. నగర ప్రజలకు కార్పొరేషన్ ద్వారా మౌలిక వసతులు.. పౌరసేవలు.. ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించాల్సి ఉంది. అధికార యంత్రాంగం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేలా కమిషనర్ చర్యలు చేపట్టాల్సి ఉంది. అయితే నగరపాలక సంస్థలో పాలన గాడితప్పి.. అవినీతి, అక్రమాలకు నిలయంగా మారింది.

రెవెన్యూ విభాగంలోనూ అదే పరిస్థితి

నగరపాలక సంస్థ కార్యాలయంలోని రెవెన్యూ విభాగంలో ఆర్వోలు, ఆర్ఐలుగా విధులు నిర్వర్తిస్తున్న కొందరు పదేళ్లకుపైగా ఇక్కడే ఉన్నారు. వీరిని బదిలీ చేసే దిశగా ఎవరూ దృష్టి సారించడం లేదు. అకౌంట్స్ విభాగంలోని కొందరు సీనియర్ అసిస్టెంట్ల పరిస్థితీ ఇదే.

పెత్తనం చెలాయింపు

కమిషనర్లు ఎంత మంది మారినా సీసీలుగా ఉన్న ఉద్యోగులే నేటికీ కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఇద్దరు ఉండగా, వీరిలో ఒకరు జూనియర్ అసిస్టెంట్.. మరొకరు బిల్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తించాల్సి ఉంది. అయితే వీరు సీసీలుగా నాలుగేళ్లుగా కొనసాగుతున్నారు. కార్యాలయంలోని ఇతర విభాగాధికారులు, సీనియర్ ఉద్యోగులనే గౌరవం లేకుండా చిన్నచూపు చూస్తూ, పెత్తనం చెలాయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కమిషనర్ పేరు చెప్పి కార్యాలయ ఉద్యోగుల మొదలుకొని కాంట్రాక్టర్ల వరకు వసూలు చేస్తూ అవినీతికి పాల్పడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రక్షాళన చేసి పరిష్కరించేనా..?

కమిషనర్‌గా మల్లవరపు సూర్యతేజ బాధ్యతలు చేపట్టారు. గాడితప్పిన పాలనపై ప్రత్యేక దృష్టి సారించి సరైన దారిలో పెట్టేందుకు ప్రక్షాళన చేయాలని పలువురు కోరుతున్నారు. సమస్యలను పరిష్కరించి పరిపాలన సజావుగా సాగేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

మేము కదలం..!

వాస్తవానికి నగరపాలక సంస్థలో విధులు నిర్వర్తించే ఉద్యోగులను మూడేళ్లకోసారి బదిలీ చేయాలి. అయితే ఇక్కడ బదిలీ అంటే ఏమిటో తెలియకపోవడం విశేషం. దాదాపు పదేళ్లకు పైగా ఒకే స్థానంలో విధులు నిర్వర్తిస్తున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఉదాహరణకు ఇంజినీరింగ్ విభాగంలో ఏఈలు, డీఈఈలు, ఈఈల స్థాయిలో ఉన్న దాదాపు 10 మంది అధికారులు ఐదేళ్లకుపైగా ఇక్కడే విధులు నిర్వర్తిస్తున్నారు. దీర్ఘకాలంగా ఒకే చోట విధులు నిర్వర్తిస్తుండటంతో కొందరు ఇంజినీరింగ్ అధికారులను ఈఎన్సీ కార్యాలయం గుర్తించి బదిలీ చేసింది. అయితే బదిలీ చేసిన ప్రాంతానికి వెళ్లిన కొద్ది రోజులకే తమ రాజకీయ పలుకుబడిని ఉపయోగించుకొని తిరిగి నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయానికే పోస్టింగ్ వేయించుకుంటున్నారు.

ఇష్టానుసారంగా..

కార్పొరేషన్ కార్యాలయంలోని వివిధ విభాగాల్లో కొంత మంది తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. సమయపాలన పాటించకుండా నిర్లక్ష్య ధోరణిని కనబరుస్తున్నారు. మరోవైపు ఒక్కో విభాగంలో ఉండాల్సిన సిబ్బంది కంటే అధికంగా ఉన్నారు. అసలు ఎందుకు ఉన్నారో.. ఏమి చేస్తున్నారో తెలియని పరిస్థితి. అడిగేవారు లేరనే ధీమాతో ఇష్టనుసారంగా వ్యవహరిస్తూ నెలనెలా జీతాలు తీసుకుంటున్నారు. ఆయా విభాగాల అధికారులు పట్టించుకోకపోవడంతోనే ఈ దుస్థితి తలెత్తుతోందని పలువురు ఆరోపిస్తున్నారు.

కేంద్ర మంత్రులను కలిసిన ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): కేంద్ర రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని ఢిల్లీలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. ఆయన్ను ఘనంగా సత్కరించారు. జిల్లా పరిధిలో జాతీయ రహదారుల అభివృద్ధికి సంబంధించిన అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

- కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో ఢిల్లీలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి భేటీ అయ్యారు. మంత్రిని ఆయన చాంబర్‌లో సత్కరించారు. అనంతరం ఫెడరేషన్ ఆఫ్ ఫార్మర్స్ అసోసియేషన్ ప్రతినిధుల వినతిపత్రాన్ని అందజేశారు. బియ్యం ఎగుమతులపై నిషేధాన్ని వెంటనే తొలగించాలని కోరారు.

ఎంహెచ్ఓ బాధ్యతల స్వీకరణ



నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్‌గా చల్లా చైతన్య బాధ్యతలను బుధవారం స్వీకరించారు. కమిషనర్ సూర్యతేజను ఆయన చాంబర్‌లో కలిసి జాయినింగ్ రిపోర్టును అందజేశారు. అనంతరం కమిషనర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలను తెలియజేశారు.

నెల్లూరు(దర్గామిట్ట): కలెక్టర్ ఆనంద్‌ను ఎంహెచ్ఓ చల్లా చైతన్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న వెంకటయ్య

నెల్లూరు(అర్బన్): వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవడం ద్వారా విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించగలరని సైకాలజిస్ట్ సురేష్‌బాబు పేర్కొన్నారు. వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్‌పై బుజబుజనెల్లూరులోని శేషు ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులకు అవగాహన సదస్సును సెట్నెల్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సహకారంతో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యువత తమ లక్ష్యాలను చేరుకునేందుకు గానూ మేధోవికాసం కలగాలని చెప్పారు. అనంతరం సెట్నెల్ సీఈఓ వెంకటయ్య మాట్లాడారు. కెరీర్‌ను ఉన్నతంగా మార్చుకునేందుకు కృషి, పట్టుదల కలిగి ఇష్టమైన రంగాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. పాఠశాల కరస్పాండెంట్ ఆదిశేషు, రూడ్స్ చైర్మన్ రసూల్, పీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, దేవరకొండ శ్రీనివాసులు, సెట్నెల్ మేనేజర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందికి జీతాలు విడుదల చేయాలి

నెల్లూరు(అర్బన్): వైద్య విధాన పరిషత్ ఏరియా ఆస్పత్రుల్లో రెగ్యులర్ మెటర్నిటీ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న 80 మంది.. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న 115 మంది ఏఎన్ఎంలకు జీతాలను వెంటనే విడుదల చేసేలా హంస రాష్ట్ర నేతలు ప్రభుత్వంతో చర్చించాలని సంఘ నేత చేజర్ల సుధాకర్‌రావు కోరారు. ఈ మేరకు విజయవాడలోని సిద్ధార్థ హాస్పిటల్లో హంస రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. సంఘ నెల్లూరు జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ నారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలివ్వాలని వినతి

నెల్లూరు(దర్గామిట్ట): అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలివ్వాలని సీనియర్ జర్నలిస్ట్ మల్లికార్జున కోరారు. ఈ మేరకు కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రాన్ని బుధవారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో 50 శాతం ఫీజు రాయితీ, ప్రెస్‌క్లబ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. కనుపర్తిపాడు, ఆమంచర్లలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను గుర్తించినా, అందజేయడంలో ఆలస్యమవుతోందని చెప్పారు. భరత్, హుస్సేన్, సురేంద్ర, శ్రావణ్, ఇలియాస్, పోలయ్య, నాయబ్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

మినీ గోకులాలపై సమీక్ష



మాట్లాడుతున్న కోటేశ్వరరావు

నెల్లూరు(బారకాసు): పశువులకు వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశు వైద్యాధికారి కోటేశ్వరరావు కోరారు. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ అవగాహన కార్యక్రమంలో భాగంగా మినీ గోకులాలపై బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గోకులం పథకాన్ని జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో అమలు చేయాలని కోరారు. జిల్లాలో 1300 పశువులు, గొర్రెల షెడ్లను ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని చెప్పారు. ఉప సంచాలకులు రమేష్‌నాయక్, డాక్టర్లు చంద్రశేఖర్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి



మాట్లాడుతున్న భాస్కరయ్య

నెల్లూరు(వీఆర్సీ సెంటర్): ఎన్నికలకు ముందు కూటమి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య డిమాండ్ చేశారు. జేమ్స్‌గార్డెన్‌లోని సీఐటీయూ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఏపీ రజక వృత్తిదారుల సంఘ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రజక వృత్తిదారులకు అధునాతన ధోబీఘాట్లను నిర్మించాలని పేర్కొన్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను ఇవ్వడంతో పాటు 50 ఏళ్ల వారికి పింఛన్‌ను అందజేయాలన్నారు. ఏపీ రజక వృత్తిదారుల సంఘ జిల్లా కమిటీ నేతలు నేరెళ్ల శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, దయాకర్, అంకయ్య, సురేంద్ర, వేదవతమ్మ, రమణయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..





నెల్లూరు(దర్గామిట్ట) / నెల్లూరు సిటీ: నెల్లూరు కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన మల్లవరపు సూర్యతేజ కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్‌ను వారి కార్యాలయాల్లో మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. ఈ సందర్భంగా మొక్కను వారికి అందజేశారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడల ప్రాధాన్యాన్ని తెలియజేస్తున్న ఉషారాణి

నెల్లూరు (టౌన్): క్రీడల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో మానసికోల్లాసం పెంపొందుతుందని సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి పేర్కొన్నారు. శిక్షా సప్తాహ్‌ను పురస్కరించుకొని మహాత్మాగాంధీనగర్‌లోని మున్సిపల్ హైస్కూల్‌ను బుధవారం సందర్శించిన అనంతరం ఆమె మాట్లాడారు. క్రీడలు ఒత్తిడిని తగ్గించి చదువుపై ఆసక్తి కనబర్చేలా చేస్తాయని చెప్పారు. క్రీడా ప్రాధాన్యాన్ని తెలియజేశారు. పాఠశాలల్లో సాంస్కృతిక దినోత్సవాన్ని గురువారం నిర్వహించాలని సూచించారు. జీసీడీఓ మమత, ఏఎంఓ సుధీర్ బాబు, సీఎంఓ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

లెప్రసీ సర్వే తనిఖీ



నెల్లూరు(అర్బన్): పడారుపల్లి అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని దివ్యాంగుల కాలనీలో నిర్వహిస్తున్న ఇంటింటి లెప్రసీ సర్వేను ఏడీఎంహెచ్ఓ, జిల్లా కుష్ఠు వ్యాధి నియంత్రణాధికారి ఖాదర్‌వలీ బుధవారం తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ వచ్చి సర్వే చేస్తున్నారానే అంశాన్ని ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రాథమిక దశలోనే కుష్ఠును గుర్తిస్తే పూర్తి స్థాయిలో నయం చేయొచ్చని చెప్పారు. జిల్లాలో అక్కడక్కడా కుష్ఠు కేసులు ఇప్పటికీ నమోదవుతుండటం బాధాకరమన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి తమ శరీరంపై తేనె, నలుపు, రాగి రంగుల్లో మచ్చలుండి.. స్పర్శ లేకపోతే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సర్వేకు సహకరించాలని కోరారు. వైద్యాధికారి విజయ్, సీఓ వెంకటయ్య, ఏఎస్ఎం సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ల పనులు వేగవంతం



సమావేశాన్ని నిర్వహిస్తున్న సూర్యతేజ

నెల్లూరు(బారకాసు): నగరంలో అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ పనులను వేగవంతం చేసి ఆగస్ట్ 15 నాటికి అందుబాటులోకి తీసుకురావాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఇంజినీరింగ్ విభాగాధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఎంపిక చేసిన అన్న క్యాంటీన్ల ప్రాంగణాలను శుభ్రం చేసి.. అవసరమైన విద్యుత్, ఫర్నిచర్ తదితర మౌలిక వసతులను కల్పించాలని సూచించారు. నగరంలో తాగునీటి సరఫరాను నిత్యం పర్యవేక్షిస్తూ.. స్వచ్ఛమైన జలాలను అందించాలని కోరారు. ఎస్ఈ సంపత్‌కుమార్, ఈఈలు సంజయ్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

వివిధ విభాగాల్లో పరిశీలన

కార్పొరేషన్ కార్యాలయంలోని వివిధ విభాగాలను కమిషనర్ సూర్యతేజ పరిశీలించారు. రెవెన్యూ, ఎస్టాబ్లిష్‌మెంట్, ప్రజారోగ్యం, టౌన్‌ప్లానింగ్, ఇంజినీరింగ్, కమాండ్ కంట్రోల్ తదితర విభాగాలను పర్యవేక్షించారు.

- పర్యావరణ పరిరక్షణలో భాగంగా కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణంలో మొక్కలను కమిషనర్ ఆధ్వర్యంలో నాటారు.

డిగ్రీ ఫలితాల్లో ‘కృష్ణచైతన్య’ విజయకేతనం



నెల్లూరు (టౌన్): డిగ్రీ ఐదో సెమిస్టర్ ఫలితాల్లో కృష్ణచైతన్య డిగ్రీ కళాశాల విద్యార్థులు యూనివర్సిటీ స్థాయిలో టాప్‌లో నిలిచారని కళాశాల డైరెక్టర్లు కృష్ణారెడ్డి, ప్రమోద్‌రెడ్డి పేర్కొన్నారు. కళాశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించిన అనంతరం వారు మాట్లాడారు. బీఎస్సీలో శ్రీహర్షిత 99.2, లక్ష్మి, కరిష్మా, పల్లవి, విజయలక్ష్మి, సౌజన్యలక్ష్మి, మహేశ్వరి 99 శాతం.. బీసీఏలో హర్షిణి 99, సాయిహర్షిత, కావ్య 98, శివకీర్తి, అమృత 97 శాతం మార్కులను సాధించారని చెప్పారు. బీఎస్సీ లైఫ్‌సైన్స్‌లో ,యశ్వంతి 99, సుమయ్య 98, తేజస్విని 97 శాతం.. బీబీఏలో లక్ష్మీప్రియ 92, సుస్మిత 91 శాతం మార్కులను సాధించారని వివరించారు. బీకాంలో భాగ్యలక్ష్మి 94, మోక్షిత, మేగవర్షిణి 91, జగదీష్, సోనీ, నిలోఫర్ 90 శాతం మార్కులను సాధించారని పేర్కొన్నారు. కళాశాల డీన్ సుధారాణి, అడ్మిన్ డీన్ రామాంజనేయులురెడ్డి, ప్రిన్సిపల్ నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు కీలకం



శ్రీరామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో..



పీఎమ్మార్ స్కూల్లో..

నెల్లూరు(బృందావనం): పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలను శ్రీరామచంద్ర మిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన కేంద్ర ఆధ్వర్యంలో బుధవారం నాటారు. ఈ సందర్భంగా మిషన్ నెల్లూరు సంస్థ సెంట్రల్ కోఆర్డినేటర్ డాక్టర్ వెంకటకృష్ణ మాట్లాడారు. శ్రీరామచంద్ర మిషన్ సంస్థ గురువు పార్థసారథి రాజగోపాలాచారి జయంతిని పురస్కరించుకొని కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు. అనంతరం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆయుష్ జిల్లా శాఖ అధికారి గోవింద్, ఆర్ అండ్ బీ ఎస్ఈ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని పాఠశాలల్లో మొక్కలు నాటుతాం

నెల్లూరు (టౌన్): రానున్న నెల్లో నెల్లూరులోని అన్ని పాఠశాలల్లో మొక్కలను నెల్లూరు డివిజన్ సామాజిక వన విభాగ సహకారంతో నాటనున్నామని భారత ప్రభుత్వ క్షేత్ర ప్రచారాధికారి నాగసాయిసూరి పేర్కొన్నారు. రంగనాయకులపేటలోని పీఎమ్మార్ మున్సిపల్ హైస్కూల్లో వన మహోత్సవ కార్యక్రమాన్ని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్స్, నెల్లూరు క్షేత్ర కార్యాలయ ఆధ్వర్యంలో నిర్వహించారు. అదే విధంగా నవాబుపేట, పత్తివారివీధి, పప్పులవీధిలోని పాఠశాలల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా నాగసాయిసూరి మాట్లాడారు. పాఠశాలల్లో మొక్కలు నాటడమే కాకుండా ప్రతి తరగతికి ఒక మొక్క సంరక్షణ బాధ్యతలను అప్పగించనున్నామని తెలిపారు. వారధి ఫౌండేషన్ చైర్మన్ రంగనాథ్, కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా దినోత్సవం



నెల్లూరు (టౌన్): శిక్షా సప్తాహ్‌ను పురస్కరించుకొని కొండాయపాళెం దళితవాడలోని నగరపాలక ప్రాథమిక పాఠశాలలో క్రీడా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు ఖోఖో, క్రికెట్, స్కిప్పింగ్, పరుగుపందెం తదితర పోటీలను జరిపారు. విజేతలకు సర్టిఫికెట్లను ఈ నెల 29న అందజేయనున్నారు. ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం



నెల్లూరు(బృందావనం): రక్తదానం ప్రాణదానంతో సమానమని పలువురు పేర్కొన్నారు. నగరంలోని చిన్నబజార్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని నెల్లూరు ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్, పాన్ బ్రోకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు కొనగళ్ల శోభన్‌బాబు మాట్లాడారు. తమ అసోసియేషన్‌కు చెందిన 110 మంది సభ్యులు రక్తదానం చేశారని తెలిపారు. ప్రధాన కార్యదర్శి ఫణీంద్రకుమార్, కోశాధికారి సుబ్రహ్మణ్యం, ప్రోగ్రామ్ చైర్మన్ జాలాది చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు తిరివీధి కిషోర్, సహాయ కార్యదర్శి చందోలు సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



స్థానికులతో మాట్లాడుతున్న పోలీసులు

నెల్లూరు సిటీ: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని వేదాయపాళెం పోలీసులు హెచ్చరించారు. మహాత్మాగాంధీనగర్‌లోని మున్సిపల్ పాఠశాలను సీఐ వెంకటనారాయణ ఆదేశాల మేరకు ఎస్సైలు భవానీ, శ్రీనివాసులు బుధవారం పరిశీలించారు. స్థానికంగా ఉంటున్న నేతలు అక్కడి పరిస్థితిని తెలియజేశారు. పాఠశాల ప్రాంగణంలో మద్యం సేవించినా.. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా ఉపేక్షించేదిలేదని ఎస్సైలు స్పష్టం చేశారు.